

హరహర మహాదేవ..
శంకర్‌పల్లి మండలం చందిప్ప శివాలయంలో భక్తుల పూజలు


నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, గురువారం 27 ఫిబ్రవరి 2025 | VIKARABAD


మహేశ్వరంలోని శివాలయంలో తనయుడు కౌశిక్‌రెడ్డితో కలిసి స్వామిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి





మహాశివరాత్రి సందర్భంగా బాటసింగారం పండ్ల మార్కెట్‌లో కొనుగోలుదారుల సందడి

# హామీ లేని ఉపాధి



పేద కుటుంబాలకు ఉపాధి కల్పించేందుకు తీసుకువచ్చిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. గత మూడేళ్లుగా కేంద్రం జిల్లాలో దాదాపు 50 లక్షల పనిదినాలను తగ్గించి ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా బంద్ చేసే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని ముందుకెళ్తుండగా, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉపాధి హామీ కూలీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం గమనార్హం. ప్రతి ఏటా వేసవిలో ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీలకు అదనపు కూలీ డబ్బులను కేంద్ర ప్రభుత్వానికి సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తూ వస్తున్నది. మండే ఎండలోనూ ఉపాధి హామీ పనులకు హాజరవుతున్న దృష్ట్యా అదనంగా కూలీ డబ్బులను పదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం చెల్లించిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి నెల నుంచి ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఉపాధి హామీ కూలీలకు అందజేసే వేతనాన్ని ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం అదనంగా చెల్లిస్తూ వస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫిబ్రవరి మాసం ముగుస్తున్నా ఇప్పటివరకు ఇంకా ఉత్తర్వులు జారీ చేయలేదు. రెండేళ్లుగా అదనపు కూలీడబ్బుల ప్రకటనకు ఫిబ్రవరిని పరిగణనలోకి తీసుకోకపోవడంతో ఉపాధి హామీ కూలీలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

- వికారాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ)

- ఫిబ్రవరి నెల ముగుస్తున్నా అదనపు కూలీ ఉత్తర్వులు జారీ చేయని రాష్ట్ర ప్రభుత్వం
- ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25, ఏప్రిల్, మేలో 30 శాతం అదనపు డబ్బులను పదేళ్లపాటు చెల్లించిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- మూడేళ్లలో 50 లక్షల పనిదినాలను తగ్గించిన కేంద్రం
- రెండేళ్లుగా అదనపు కూలీ చెల్లించని కాంగ్రెస్ సర్కారు

### ఇప్పటివరకు 59.71 లక్షల పనిదినాలు కల్పన

ఈ ఆర్థిక సంవత్సరం 67.37 లక్షల పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించగా.. ఇప్పటివరకు 59.71 లక్షల పని దినాలను మాత్రమే జిల్లా యంత్రాంగం కల్పించింది. ప్రస్తుతం జాతీయ ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీలకు రోజుకు రూ.300 కూలీ డబ్బులను అందజేస్తున్నారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలకుగాను ఇప్పటివరకు రూ.142.28 కోట్ల చెల్లింపులను పూర్తి చేశారు. మరోవైపు జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంతల నిర్మాణం, నీటి ఊట గుంతల నిర్మాణం, మట్టి రోడ్ల నిర్మాణం పనులను ప్రధానంగా చేస్తున్నారు. అసైన్డ్ భూముల్లోని రాళ్లను తీసివేయడం, భూమిని చదునుచేయడం, బౌండ్రీలు ఏర్పాటు చేయడం, ఎరువు గుంతల నిర్మాణం, బోరుబావి తవ్వించడం తదితర పనులు చేపట్టనున్నారు. ఇంకుడు గుంతల నిర్మాణం, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, మట్టి కట్టలు, నీటి ఊట గుంతలు, పశువులకు షెడ్ల ఏర్పాటు, భూ ఉపరితల నీటి గుంతల నిర్మాణం, పంట కాలువల మరమ్మతులు, పంట మార్పిడి కల్లాలు, కొత్త సేద్యపు బావులు తవ్వడం, నిరవధిక సమతల కందకాలు, ఖండిత సమతల కందకాలు, కొండ దిగువ ప్రాంతాల్లో నీటి నిల్వ కందకాలు, పశువుల నిరోధక కందకాలు, భూసార సంరక్ష కందకాలు, కొత్త పంట కాలువల నిర్మాణం, మైనర్ ఇరిగేషన్ కాలువల్లో పూడికతీత, చేపల ఉత్పత్తి కుంటల నిర్మాణం, వరద కట్టల నిర్మాణం పనులను చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 2,00,372 ఉపాధి హామీ కుటుంబాలుండగా.. 4,38,398 మంది కూలీలున్నారు.

### 3756 కుటుంబాలకే వంద రోజుల పని

ప్రతి ఏటా ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిని కల్పించడం పోయి కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలతో ఈ ఆర్థిక సంవత్సరం వేల కుటుంబాలకు ఉపాధి హామీ పనులు దూరమయ్యాయి. జిల్లావ్యాప్తంగా ఆర్థిక సంవత్సరంలో కనీసం 10 శాతం మేర కుటుంబాలకు కూడా పనిని కల్పించలేకపోయారు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో 30 రోజులే గడువున్నా ఇప్పటివరకు కేవలం 3756 కుటుంబాలకు మాత్రమే వంద రోజుల పనిని కల్పించారు. రెండేళ్ల క్రితం వరకు జిల్లాలో ప్రతి ఏటా 20 వేలకుపైగా కుటుంబాలకు వంద రోజులపాటు పనులను కల్పించగా, గత రెండేళ్లుగా వంద రోజుల పని పొందే కూలీల సంఖ్య మూడు వేలకు తగ్గిపోవడం గమనార్హం. జిల్లాలోని కొడంగల్, నవాబుపేట, మర్పల్లి, వికారాబాద్, దోమ, మర్పల్లి, పెద్దేముల్, మోమిన్‌పేట్, కోట్‌పల్లి, ధారూరు, కులకచర్ల మండలాల్లో మాత్రమే 100 కుటుంబాలకుపైగా వంద రోజులపాటు పనిని కల్పించగా, మిగతా 7 మండలాల్లో సింగిల్, డబుల్ డిజిట్‌లోనే కుటుంబాలకు వంద రోజుల పని కల్పించారు. తాండూరు మండలంలో అత్యల్పంగా కేవలం 19 కుటుంబాలకు., బషీరాబాద్‌లో 28, దౌల్తాబాద్‌లో 37, బొంరాస్‌పేట్‌లో 51, యాలాలలో 58, పూడూరులో 71, బంట్వారం మండలంలో 88 కుటుంబాలకు వంద రోజుల పనిని కల్పించారు.



ఓ తహసీల్దార్ కార్యాలయాల వద్ద రిజిస్ట్రేషన్ల కోసం నిరీక్షిస్తున్న క్రయవిక్రయదారులు

# సర్వర్ సమస్యతో పౌర సేవలకు బ్రేక్

- రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ముందుకుసాగని భూముల రిజిస్ట్రేషన్లు
- ఒక్కొక్క రిజిస్ట్రేషన్‌కు గంటల తరబడి సమయం
- ఇబ్బందులకు గురవుతున్న రైతులు, ప్రజలు

రంగారెడ్డి జిల్లాలో గత కొంతకాలంగా సర్వర్ సమస్య కారణంగా తహసీల్దార్ కార్యాలయాల్లో పనులు ఎక్కడికక్కడే స్తంభించిపోయాయి. జిల్లాలో భూముల క్రయవిక్రయాలు కూడా అత్యధికంగా ఉంటున్నందున రిజిస్ట్రేషన్లకు అదే స్థాయిలో డిమాండ్ ఉన్నది. రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్‌లు బుక్‌చేసుకున్నవారు తహసీల్దార్ కార్యాలయాలకు వస్తున్నారు. రిజిస్ట్రేషన్ల ప్రారంభంలోనే డౌన్‌లోడ్ సమస్య తలెత్తుతున్నది. ఒక్కొక్క రిజిస్ట్రేషన్‌కు గంటల తరబడి సమయం పడుతున్నది. ఒక్కోరోజు పూర్తిగా రిజిస్ట్రేషన్లు కూడా నిలిచిపోతున్నాయి. దీంతో మరో రోజుకు స్లాట్‌లు మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్క స్లాట్‌ను మూడుసార్లు మాత్రమే మార్చుకునే అవకాశం ఉంటుంది. సర్వర్ సమస్యతో స్లాట్ కాలపరిమితి కూడా ముగిసిపోతున్నది. సర్వర్ సమస్య గురించి అడిగితే పై అధికారులకే తెలియాలని తెలివిగా తప్పించుకుంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గంటసేపట్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయి పాస్ బుక్కులు కూడా చేతికందేవని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ భూములు తాము అమ్ముకునే స్వేచ్ఛ కూడా లేకుండా పోయిందని వాపోతున్నారు.

- రంగారెడ్డి, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ)

### 'మీ సేవ'ల్లోనూ ఇదే దుస్థితి


భూముల రిజిస్ట్రేషన్ కోసం మీ సేవకు వెళ్లి స్లాట్ బుక్ చేసుకోవాలన్నా సులువుగా సాధ్యం కావడం లేదు. మీ సేవల్లో కూడా సాంకేతిక సమస్యలు తలెత్తి స్లాట్ బుక్ కావడానికి తీవ్ర జాప్యం జరుగుతున్నది. గంటల తరబడి కంప్యూటర్ల ముందు కూర్చుని స్లాట్ బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుత్నుది. స్లాట్ బుక్కైన తర్వాత తహసీల్దార్ కార్యాలయంలో సర్వర్ సమస్య కారణంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోతున్నాయి. రిజిస్ట్రేషన్ సమస్య జిల్లా రైతులను, క్రయవిక్రయదారులను తరచుగా వేధిస్తున్నది. దీనిపై ఎవరూ పట్టించుకోకపోవడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

### ముందుకు సాగని సేవలు

సర్వర్ సమస్యలతో తహసీల్దార్ కార్యాలయాల్లో కూడా పౌర సేవలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నది. తహసీల్దార్ కార్యాలయాల నుంచి మ్యుటేషన్లు, టీఎం33లో భాగమైన మిస్సింగ్ సర్వే నంబర్లు, పేర్ల తప్పొప్పులు, విస్తీర్ణంలో మార్పులు, చేర్పుల వంటి పనులు కూడా సర్వర్ సమస్యతో ముందుకు సాగడంలేదు. జిల్లావ్యాప్తంగా సుమారు 20వేలకు పైగా దరఖాస్తులు తహసీల్దార్, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

### సర్వర్ సమస్యతో ఇబ్బంది పడుతున్నాం





తహసీల్దార్ కార్యాలయంలో సర్వర్ సమస్యతో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ

రిజిస్ట్రేషన్ల విషయంలో తరచుగా సర్వర్ సమస్య ఏర్పడుతుండటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. స్లాట్ బుక్ అయినప్పటికీ తహసీల్దార్ కార్యాలయంలో మాత్రం రిజిస్ట్రేషన్లు ముందుకు సాగడంలేదు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన డాక్యుమెంట్లు డౌన్‌లోడ్ కాకపోవడంతో ఎక్కడికక్కడే రిజిస్ట్రేషన్లు ఆగిపోతున్నాయి. ఒక్క రిజిస్ట్రేషన్ కోసం రెండు మూడు రోజులు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. సర్వర్ సమస్యకు పరిష్కారం చూపాలి.

**- మహేశ్, డాక్యుమెంట్ రైటర్**

# పసికందులను రాష్ట్రాలు దాటిస్తున్నదెవరు?

- పసిపిల్లల విక్రయ ముఠాల సూత్రధారులెక్కడ..?
- గత ఏడాది 60 మంది పిల్లలను విక్రయించిన ముఠా

సిటీబ్యూరో, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : పసిపిల్లల విక్రయాల కేసులో ఇతర రాష్ట్రాల్లో కీలక నిందితుల మూలాలు తెలియకుండా పోవడం ఓ మిస్టరీలా మారింది. పసిపిల్లలను విక్రయించడం..ఆ తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం.. ఇలా చేస్తూ పోలీసుల నిఘా నుంచి విక్రయ ముఠాలు తప్పించుకుంటున్నాయి. అచ్చం సినిమా కథలా పసిపిల్లల విక్రయ ముఠా.. పుట్టిన పసికందులను వేల కిలోమీటర్లు అక్రమంగా రవాణా చేస్తూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ ముఠాలు విక్రయిస్తున్నాయి. గత ఏడాది మే నెలలో రాచకొండలోని మేడిపల్లి పోలీసులు ఇలాంటి ముఠాలో 11 మందిని అరెస్ట్ చేసి, 14 మంది పసిపిల్లలను కాపాడారు. ఈ ముఠాకు ఢిల్లీ, మహారాష్ట్రలతో సంబంధముందని తేలింది. తాజాగా చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో పిల్లల విక్రయ ముఠాను అరెస్ట్ చేశారు. పిల్లలను కొనుగోలు చేసిన దంపతులను సైతం పోలీసులు ఈసారి అరెస్ట్ చేశారు. ఈ ముఠాకు గుజరాత్‌తో సంబంధాలున్నట్లు వెల్లడయ్యింది. ఇతర రాష్ట్రాల్లో అల్లుకుపోయిన ఈ ముఠాల నెట్‌వర్క్‌ను ఛేదించడంలో అటు ఆ రాష్ట్రాలకు చెందిన పోలీసులు, ఇటు తెలంగాణ పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. అయితే ఇప్పటివరకు పిల్లలను అపహరించుకొని తీసుకొస్తున్నారా? పుట్టిన బిడ్డలను వారి తల్లిదండ్రులే స్వయంగా డబ్బుకు ఆశపడి విక్రయిస్తున్నారా? అనే విషయంలో స్పష్టత లేదు. పిల్లలు లేనివారు అక్రమ పద్ధతిలో పిల్లలను కొనుగోలు చేస్తుండడం ఆందోళన కలిగిస్తున్న అంశం. ఈ నెట్‌వర్క్‌ను పోలీసులు ఛేదించలేకపోవడంతో.. కాపాడిన పిల్లలను వారి సొంత తల్లిదండ్రుల వద్దకు చేర్చలేని పరిస్థితి నెలకొన్నది.

### రెండు రాష్ట్రాల్లో గాలించినా..

మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక స్వచ్ఛంద సంస్థ సహకారంతో పిల్లల విక్రయం ముఠాను గత ఏడాది మేలో మేడిపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఇందులో మేడిపల్లికి చెందిన శోభ, స్వప్న, షేక్ సలీమ్‌లతో పాటు పద్మ, సరోజ, శారద, షకీలా, రాజు, ముంతాజ్ తదితరులను అరెస్ట్ చేశారు. ఈ పిల్లలు ఎక్కడక్కడ విక్రయించారనే విషయాన్ని గుర్తించి విక్రయించిన 14 మంది పిల్లలను కాపాడారు. పిల్లలను రూ.5 లక్షల వరకు వెచ్చించి కొనుగోలు చేసిన తల్లిదండ్రులు.. రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఎదుట ఆందోళన సైతం చేశారు. ఇదే ముఠా ముంబయిలోనూ పిల్లలను విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడయ్యింది. ఈ ముఠాపై థానే పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ముఠా 60 మంది వరకు పిల్లలను విక్రయించిందని పోలీసుల విచారణలో తేలింది. ఏపీ, తెలంగాణకు చెందిన ఏజెంట్ల ద్వారా పిల్లలను విక్రయించడంలో కీలకంగా వ్యవహరించిన ఢిల్లీకి చెందిన కిరణ్, ప్రీతి, పుణేకు చెందిన కన్నయ్యలను పట్టుకుంటే కీలక నిందితుల ఆచూకీ తెలుస్తుందని రాచకొండ పోలీసులు ప్రయత్నించారు. ఆయా రాష్ట్రాల్లో ఉన్న దళారుల ఆచూకీ తెలియకపోవడంతో మూలాల వరకు వెళ్లలేకపోయారు. 8 నెలలు గడిచిన తరువాత తాజాగా మరో ముఠా పట్టుబడింది, ఈ ముఠాలోకి కీలక నిందితురాలు వందనగా పోలీసులు అనుమానిస్తున్నారు. సోషల్‌మీడియాలో మల్కాజిగిరికి చెందిన కోల కృష్ణవేణి ద్వారా ఏపీ, తెలంగాణలో పసిపిల్లల విక్రయాలు సాగాయి. ఇప్పుడు వందనకు సంబంధించిన ఆచూకీ దొరికితే ఈ నెట్‌వర్క్ బయటపడే అవకాశాలున్నాయి.

### ఎంత మందిని విక్రయించారో..?

పిల్లలను ఎక్కడి నుంచి తెస్తున్నారనే విషయంపై ఇప్పటివరకు స్పష్టత లేదు. కేవలం తెలంగాణలోనే 8 నెలల వ్యవధిలో రెండు ముఠాలకు సంబంధించిన ఆచూకీ బయటపడింది. సోషల్‌మీడియా ద్వారా ఈ ముఠా తమ కార్యకలాపాలను సాగిస్తూ, పోలీసులకు చిక్కకుండా ఎత్తులు వేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. గుజరాత్‌కు చెందిన వందన, ఢిల్లీ, పుణేలకు చెందిన కిరణ్, ప్రీతి, కన్నయ్య లాంటివాళ్లు తమ నెట్‌వర్క్‌ను అన్ని రాష్ట్రాలలోనూ నిర్వహించే అవకాశాలున్నాయని పోలీసులు అనుమానిస్తున్నారు. హైదరాబాద్‌లో ఈ ముఠా పట్టుబడగానే అప్పటివరకు నిర్వహించిన నెట్‌వర్క్‌లోని సభ్యులందరూ అజ్ఞాతంలోకి వెళ్లిపోతున్నట్లు పోలీసులు గుర్తించారు. కొన్నాళ్లు స్తబ్ధుగా ఉంటూ తిరిగి తమ నెట్‌వర్క్‌ను యాక్టివేట్ చేస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. తాజాగా అరెస్టయిన కృష్ణవేణికి గత ఏడాది ఢిల్లీకి చెందిన ముఠాతో సంబంధాలున్నాయి. ఈ రెండు నెట్‌వర్క్‌లకు ఎక్కడో ఓ దగ్గర లింక్ ఉండే అవకాశాలున్నాయని రాచకొండ పోలీసులు భావిస్తున్నారు. మేడిపల్లి, చైతన్యపురి పోలీస్‌స్టేషన్లలో నమోదైన పిల్లల అక్రమ రవాణాకు సంబంధించిన కేసులను ఛాలెంజ్‌గా తీసుకొని వాటి ములాలను ఛేదించేందుకు గాలింపు ముమ్మరం చేశారు. పోలీసుల కంటే ముందే నిందితులు ఎత్తులు వేస్తుండడంతో, పోలీసులు కీలక నిందితులను పట్టుకుంటారా? లేదా? అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.